# గుట్టలో టూరిజం పార్కు

## దాతార్‌పల్లిలో ఏర్పాటుకు వడివడిగా అడుగులు

- ఇప్పటికే 55 ఎకరాల స్థలం గుర్తింపు
- డీపీఆర్ సిద్ధం చేస్తున్న అధికారులు
- అందుబాటులోకి వస్తే పర్యాటకంగా మరింత అభివృద్ధి
- గుట్టను దర్శించుకొని.. పార్కును విజిట్ చేసేలా ప్లాన్
- ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు
- అధికారంలోకి రాగానే ప్రారంభిస్తాం : ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

రాష్ట్రంలో అన్ని రంగాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. యాదగిరిగుట్టను ఇలవైకుంఠంగా తీర్చిదిద్దింది. రూ.13వేల కోట్ల వ్యయంతో అద్భుతంగా రూపుదిద్ది తెలంగాణకే మకుటంగా మలిచింది. యాదగిరిగుట్ట పక్కనే 11.5 టీఎంసీలతో బస్వాపూర్ రిజర్వాయర్‌ను నిర్మించింది. ఇది భవిష్యత్‌లో మంచి టూరిస్ట్ స్పాట్‌గా నిలువనుంది. వీటికితోడు మరో పెద్ద పర్యాటక కేంద్రంగా టూరిజం పార్కును ఏర్పాటు చేయాలని గతంలోనే ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగా యాదగిరిగుట్ట మండలంలోని దాతారుపల్లిలో స్థలాన్ని గుర్తించింది. 55 ఎకరాల్లో పార్కును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం గతంలోనే స్థల పరిశీలన చేశారు. ఇక్కడ అందరినీ ఆకట్టుకునేలా పార్కును అద్భుతంగా తీర్చిదిద్దనున్నారు.

– యాదాద్రి భువనగిరి, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ)



యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ప్రధానాలయం

### డీపీఆర్ సిద్ధం

టూరిజం పార్కు ఏర్పాటుకు డీపీఆర్ రూపకల్పన ప్రక్రియ కొనసాగుతున్నది. అయితే.. డీపీఆర్ రొటీన్‌గా కాకుండా వినూత్నంగా పార్కును నిర్మించేలా ప్లాన్ చేస్తున్నారు. ఆధ్యాత్మిక ప్రాంతం యాదగిరిగుట్టను దర్శించుకున్న తర్వాత పార్కును విజిట్ చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. బోట్స్ క్లబ్, పార్కు, విల్లాలు, మినీ శిల్పారామం మాదిరి తదితర నిర్మాణాలు ఉండనున్నాయి. యాదగిరిగుట్టను దర్శించుకున్నాక.. ఔటింగ్ మాదిరి రెండు, మూడు రోజులు ఇక్కడే ఉండి కుటుంబంతో సంతోషంగా గడిపేలా పార్కును నిర్మించనున్నారు. డీపీఆర్ సిద్ధమైన తర్వాత ఎన్ని కోట్లతో ఏర్పాటు చేయాలనేది స్పష్టత రానుంది.

### ఉపాధి.. భూముల రేట్లు పెంపు

టూరిజం పార్కు ఏర్పాటుతో అనేక విధాలుగా మేలు జరుగనుంది. యాదగిరిగుట్ట మండలంతోపాటు ఇతర ప్రాంతాల రూపురేఖలు మరింత మారనున్నాయి. అనేక మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. దీంతో యువత స్థానికంగా ఉంటూ ఉపాధి పొందవచ్చు. ఇక ఇప్పటికే యాదగిరిగుట్ట పునర్నిర్మాణంతో పెరిగిన భూముల రేట్లు మరింత పెరుగనున్నాయి. యాదగిరిగుట్టతోపాటు రాజాపేట, తుర్కపల్లి, ఆలేరు, బొమ్మలరామారం తదితర మండలాల్లోని గ్రామాల్లో భూముల రేట్లు ఆకాశాన్ని తాకనున్నాయి.



### టూరిజం పార్కుతో ఎన్నో విధాలుగా మేలు

యాదగిరిగుట్ట మండలంలోని దాతారుపల్లిలో టూరిజం పార్కు ఏర్పాటుకు గతంలో అడుగులు పడ్డాయి. దీనికోసం 55 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. డీపీఆర్ రూపకల్పన ప్రక్రియ జరుగుతున్నది. ఇది పూర్తయితే ఏం చేయాలి.. ఎన్ని కోట్లతో ఏర్పాటు చేయాలనేది స్పష్టత వస్తుంది. మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచాక అద్భుతంగా తీర్చిదిద్ది అందుబాటులోకి తీసుకొస్తాం.

– గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్

# 9 ఏండ్లు కోట్ల మొక్కలు

## పచ్చదనంతో పరిఢవిల్లుతున్న సూర్యాపేట జిల్లా

సత్ఫలితాలిస్తున్న హరితహారం

- ఉమ్మడి రాష్ట్రంలో 1 శాతమే అటవీ విస్తీర్ణం.. నేడు 10 శాతానికి పెంపు
- పచ్చని చెట్లతో కళకళలాడుతున్న పల్లెలు, పట్టణాలు
- వేసవిలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 50 నుంచి 44 డిగ్రీలకు తగ్గుదల
- పెరిగిన వర్షపాతం.. కరువుఛాయలు దూరం

ఉమ్మడి రాష్ట్రంలో కరువు కాటకాలకు నిలయమై.. మోడువారిన సూర్యాపేట ప్రాంతం నేడు అత్యంత అహ్లాదకరంగా మారింది. ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ఉద్యమ రీతిన చేపడుతున్న హరితహారం.. పుష్కలంగా సాగు నీళ్లు అందిస్తుండడంతో జిల్లాలో పచ్చదనం వికసిస్తున్నది. తొమ్మిదేండ్లలో దాదాపు 20 కోట్ల మొక్కలు నాటడంతో నేడు ఎక్కడికక్కడ అడవులు దర్శనమిస్తున్నాయి. సాధారణంగా భూ భాగంలో 33 శాతం అడవులు ఉండాల్సి ఉండగా.. సూర్యాపేట జిల్లాలో రికార్డుల ప్రకారం 2.5 శాతం ఉన్నది. వాస్తవ పరిస్థితిలో మాత్రం ఒక శాతం కూడా లేదు. పేరుకు 27,650 ఎకరాల అటవీ భూములు ఉండగా.. పచ్చదనం ఎక్కడా లేదు. ఇక పల్లెలు, రహదారుల వెంట కనీసం ఐదు నిమిషాలు సేద తీరేందుకు పచ్చని చెట్టు మచ్చుకు కూడా కనిపించేది కాదు. అలాంటిది హరితహారంతో జిల్లాలో ఎక్కడికక్కడ అడవులను తలపించే రీతిన మొక్కలు చెట్లుగా పెరుగుతున్నాయి.

– సూర్యాపేట, నవంబర్ 3 (నమస్తే తెలంగాణ)




అర్వపల్లి పల్లె ప్రకృతి వనం

### తగ్గుతున్న ఉష్ణోగ్రతలు.. సకాలంలో వర్షాలు

తొమ్మిదేండ్లుగా హరితహారంలో నాటిన మొక్కలు పెరిగి పచ్చదనం పంచుతుండడంతో సకాలంలో వర్షాలు పడడంతోపాటు ఉష్ణోగ్రతలు సైతం తగ్గుతున్నాయి. ఐదారేండ్ల క్రితం వరకు రాష్ట్రంలో రామగుండం, కొత్తగూడెం తదితర అత్యధిక ఉష్ణోగ్రతలు ఉండే ప్రాంతాలతో సూర్యాపేట పోటీ పడి రికార్డు స్థాయిలో 50 డిగ్రీల సెల్సియస్ నమోదైన విషయం విదితమే. అలాంటిది గత మూడేండ్లుగా 44 డిగ్రీలకు మించి నమోదు కాకపోవడం గమనార్హం. ఇక వర్షాలు పడక దశాబ్దాల తరబడి కరువు ప్రాంతంగా ఉన్న సూర్యాపేట జిల్లాలోని దాదాపు 70శాతం భూములు బీళ్లుగా ఉండగా.. నేడు భారీ వర్షపాతం నమోదు కావడంతోపాటు నదుల నీళ్లు కూడా వస్తుండడంతో కరువు దూరమైంది.

### నేడు ఎటు చూసినా చెట్లే

ముఖ్యమంత్రి కేసీఆర్ 2015లో ఉద్యమంలా ప్రారంభించిన హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే లక్ష్యంతో మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో తొమ్మిదేండ్లలో పచ్చని సూర్యాపేటగా మారింది. జిల్లా వ్యాప్తంగా 6,19,989 ఎకరాల భూమి ఉండగా.. అందులో 33 శాతం అటవీ భూములు ఉండాలి. కానీ.. 2014కు ముందు పట్టుమని 10వేల ఎకరాల్లో కూడా అడవి లేకపోగా.. ఏడు హరితహారాల్లో పల్లెలు, పట్టణాల రహదారులతోపాటు జాతీయ రహదారులు, ఇంటర్నల్ రోడ్ల వెంట విరివిగా మొక్కలు నాటారు. ఆ ఏరియా సుమారు 67,477 ఎకరాలుగా ఉన్నది. జిల్లాలో 27,650 ఎకరాల అటవీ భూముల్లో 2.17 కోట్ల మొక్కలు నాటడంతోపాటు విత్తన బంతులు వేశారు. గ్రామాలు, పట్టణాల రహదారులు, హైవేలతోపాటు అంతర్గత రోడ్లు కలిపి సుమారు 7,106 కిలోమీటర్ల పొడవునా రెండు పక్కల నాటిన మొక్కలు దాదాపు 27,450 ఎకరాలు ఉన్నది. వీటికితోడు జిల్లాలోని 473 పల్లె ప్రకృతి వనాలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, విద్యా సంస్థలు ఇలా అన్నీ కలిపి మరో 12,377 ఎకరాల్లో సుమారు 12 కోట్ల వరకు మొక్కలు నాటగా అవి నేడు ఏపుగా పెరిగి అడవులను తలపిస్తున్నాయి. ఇక అటవీ భూముల విషయానికి వస్తే.. జిల్లాలో దాదాపు 42వేల ఎకరాలకు పైనే అటవీ భూములు ఉండగా గతంలో వాటి సంరక్షణను ఎవరూ పట్టించుకోలేదు. దీంతో దశాబ్దాల తరబడి అన్యాక్రాంతం అవుతూ నేడు 27,650 ఎకరాలకు కుదించబడింది. రికార్డుల ప్రకారం అవి అడవులు అయినా.. వాటిలో పచ్చదనం కనిపించకపోయేది. అలాంటిది తొమ్మిదేండ్ల క్రితం హరితహారం ప్రారంభం కాగానే రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మంత్రి జగదీశ్‌రెడ్డి చొరవతో దాదాపు 3 కోట్ల వరకు మొక్కలు నాటడంతోపాటు విత్తన బంతులు చల్లించడంతో నేడు పచ్చగా మారుతున్నది.



చివ్వెంల మండలం దురాజ్‌పల్లి వద్ద జాతీయ రహదారిపై హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఏపుగా పెరిగిన దృశ్యం